

శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 5,10,581
బంగారం: 750 మిల్లీ గ్రాములు
వెండి: 22 గ్రాముల 400 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ

ఓలా పేరుతో బురిడీ..!



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా ఫలితాలు కనిపించడం లేదు. తాజాగా ఓ యువకుడిని ఓలా బైక్ బుకింగ్ పేరిట సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించారు.

- 8లో

మూడో దశలో 60.07 శాతం పోలింగ్

భువనేశ్వర్: రాష్ట్రంలో మూడో దశ ఎన్నికలు పురస్కరించుకుని శనివారం 6 లోక్ సభ స్థానాలకు పోలింగు జరిగింది. ప్రాథమిక గణాంకాల ప్రకారం 60.07 శాతం పోలింగ్ జరిగింది. సంబలపూర్‌లో అత్యధికంగా 68.87 శాతం, భువనేశ్వర్‌లో అత్యల్పంగా 53.54 శాతం పోలింగ్ నమోదైంది. 42 శాసన సభ స్థానాలకు సంబంధించి సంబలపూర్ జిల్లాలో అత్యధికంగా 70.98 శాతం, కటక్ జిల్లాలో 53.14 శాతం అత్యల్పంగా పోలింగు జరిగినట్లు గణాంకాలు వెల్లడించాయి.

న్యూస్‌రీల్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సోమనాథ్ మృతదేహం

జయపురం: విద్యుత్ స్తంభంపై నుంచి జారిపోయి పక్కనే ఉన్న తీగలపై పడడంతో షాక్‌కు గురై వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో శనివారం చోటుచేసుకుంది. మృతుడు టంగినిగుడ గ్రామం ఖొరా వీధికి చెందిన సోమనాథ్ గొడన(45)గా గుర్తించారు. ఈయన బొగ్గుల కొలిమిలో ఇనుము కాల్చుతూ వస్తువులు తయారు చేస్తుంటాడు. తన పనిపై బొయిపరిగుడ సమితి తెంతులిగుమ్మ పంచాయితీ అవులగుడ గ్రామానికి వెళ్లారు. అవులగుడ నుంచి మల్కనగిరి లులేర్ గ్రామం వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఆ మార్గంలో కొన్ని చోట్ల స్తంభాల నిర్మాణం చేపడుతున్నారు. స్తంభాల కోసం ఇనుము కాల్చే పనిలో సోమనాథ్ గొడన చేరాడు. పనిలో భాగంగా స్తంభం ఎక్కిన ఆయన ప్రమాదవశాత్తు పైనుంచి జారిపోయి పక్కన ఉన్న విద్యుత్ తీగలను తాకడంతో షాక్‌కు గురయ్యాడు. తోటి కార్మికులు వెంటనే సమీపంలో ఉన్న మత్తిలి కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే సోమనాథ్ మరణించారని నిర్ధారించారు. విషయం తెలిసిన భార్య, ముగ్గురు బిడ్డలు కన్నీరుమున్నీరుగా రోదించారు. ఈ ఘటనపై రామగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన సోమనాథ్ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

పాముకాటుతో యువతి మృతి



షకీల మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి పనాస్పూట్ పంచాయతీ డబలగూడ గ్రామంలో ఒక యువతి పాముకాటుతో మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం రాత్రి గ్రామంలో రాందాస్ హంతాల్ కుమార్తె షకీల(20) ఇంటి బయట నిద్రపోయింది. అయితే అర్ధరాత్రి 2 గంటల సమయంలో తనను ఏదో జంతువు కాటువేసినట్లు తెలియడంతో పెద్దగా కేకలు వేస్తూ లేచింది. వెంటనే చుట్టుపక్కల చూడగా ఒకపాము పక్కనే ఉన్నటువంటి గోతిలోకి వెళ్లడం గమనించారు. దీంతో హుటాహుటిన జోడాంబ్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జోడాంబ్ పోలీసులు కేసు నమోద్ చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి శనివారం తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా

- ఇద్దరికి గాయాలు



గాయాలతో బయటపడిన డ్రైవర్, హెల్పర్

రాయగడ: సదరు సమితి గుమ్మ ఘాటి మలుపు వద్ద లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ నుజ్జునుజ్జవ్వగా లారీలో ఉన్నటువంటి డ్రైవర్, హెల్పర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శనివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి కుంభికోట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొరాపుట్ జిల్లా కక్కిరిగుమ్మ నుంచి ఏఆర్ఎస్ఎస్ అనే సంస్థకు చెందిన ఒక లారీ రాయగడకు వస్తోంది. ఈ క్రమంలో గుమ్మ గ్రామానికి చేరుకునే సమయంలో మలుపు వద్ద లారీ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే గుమ్మ గ్రామంలోని కొందరు యువకులు సంఘటన స్థలానికి చేరుకొని లారీ మధ్య ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీసి అంబులెన్స్ సాయంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. గాయాలైనవారి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తాపడిన లారీ

పోలింగ్ ప్రశాంతం

- ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం నవీన్, ఇతర ప్రముఖులు
- పకడ్బందీగా వెబ్ క్యాస్టింగ్



ఓటు హక్కు వినియోగించుకుంటున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వేయడం అత్యంత ముఖ్యమని, ప్రధానంగా యువ ఓటర్లు తమ ఓటు హక్కును అధిక సంఖ్యలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. శనివారం మూడో దశ ఎన్నికల్లో భాగంగా స్థానిక ఏరోడ్రోమ్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు నవీన్ నివాసం నుంచి పోలింగ్ కేంద్రానికి నడిచి వెళ్లారు.అనంతరం నవీన్ సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగారు. 2009, 2014, 2019 సంవత్సరాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగు అంతంతమాత్రంగా జరిగిందని, ఈ పరిస్థితిని మెరుగుపరిచే దిశగా ప్రతి ఓటరు ఓటు హక్కుని సద్వినియోగపరచుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. శాసన సభ, లోక్ సభ ఎన్నికలలో బిజూ జనతా దళ్ (బీజేడీ) గొప్ప విజయాన్ని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు, జగన్నాథుని ఆశీస్సుల వల్ల రాష్ట్రంలో మళ్లీ సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఓటు వేయడం పౌరుల బాధ్యత



జంషెడ్‌పూర్ పోలింగు కేంద్రంలో ఓటు వేసిన రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ దంపతులు

భువనేశ్వర్: ప్రజాస్వామ్య పటిష్టతకు ఓటు వేయడం పౌరుల బాధ్యతకు ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ తెలిపారు. శనివారం జరిగిన ఎన్నికలో తన కుటుంబంతో కలిసి బాధ్యతాయుతమైన పౌరునిగా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా జంషెడ్‌పూర్ ప్రాంతంలో పోలింగు కేంద్రంలో కుటుంబీకులతో లైన్‌లో నిలిచి ఓటు వేశారు.

ఆకట్టుకున్న ఆదర్శ పోలింగ్ కేంద్రాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో మూడో దశ పోలింగు పురస్కరించుకుని పలు పోలింగు కేంద్రాలు ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్నాయి. ఈ ప్రాంగణాల్లో సెల్ఫీ వేదికలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సాధారణ ఓటరు మొదలుకొని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వంటి మహామహులు సెల్ఫీ ముచ్చటతో ఓటు వేసిన గుర్తుతో ఫొటోలు తీసుకోవడం విశేషం. నీ ఓటు నీ అభిప్రాయం నినాదం, నేను ఒక గర్విత ఓటరు నినాదాలతో ఓటరుని చైతన్యపరిచాయి.



నవీన్ సెల్ఫీ ముచ్చట



యూనిట్ 6 ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఊయల ఆకారంలో సెల్ఫీ పాయింట్



యూనిట్ 3 క్యాపిటల్ స్కూల్ పోలింగ్ కేంద్రం ఆవరణలో గిటార్ ఆకారంలో సెల్ఫీ పాయింట్



యూనిట్ 1 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గాలిపటం ఆకారంలో సెల్ఫీ పాయింట్



ఆదిమ గిరిజన సమూహాల సంప్రదాయ నమూనా పోలింగ్ కేంద్రం

5 క్వింటాళ్ల మామిడి పండ్లతో సైకత శిల్పం

భువనేశ్వర్: ప్రముఖ సైకత కళాకారుడు పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు పూరీ బీచ్‌లో శనివారం భారీ సైకత శిల్పాన్ని రూపొందించారు. ఎన్నికల పండగ – దేశానికి గర్వకారణం (చునావ్ కా పర్వ్, దేశ్ కా గర్వ్) అనే సందేశంతో ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐదు క్వింటాళ్ల మామిడి పండ్లను వినియోగించి సుమారు ఐదు గంటల పాటు శ్రమించి ఈ శిల్పాన్ని తీర్చిదిద్దారు.



పూరీ సాగర తీరంలో ఓటరు చైతన్య సైకత శిల్పం

ఓటు వేసిన ప్రముఖులు

భువనేశ్వర్: రాష్ట్రంలో మూడో దశ ఎన్నికలు పురస్కరించుకుని శనివారం సామాన్య పౌరులతో పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖులు పోలింగు ప్రారంభమైన కాసేపటికే సంబంధిత కేంద్రాలో బారులు తీరి ఓటు వేయడం విశేషం.



బీజేడీ వ్యూహకర్త వి.కార్తికేయ పాండియన్



నికుంజ బిహారి ధొలొ, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి



చంచల్‌రాణా, ఖుర్దా జిల్లా కలెక్టర్



సతీసమేతంగా వచ్చిన ప్రదీప్ కుమార్ జెనా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



అరుణ్‌కుమార్ షడంగి, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్



సంజీవ్ పండా, జంట నగరాల పోలీస్ కమిషనర్




అపరాజిత షడంగి, భువనేశ్వర్ లోక్‌సభ సభ్యురాలు



మానస్ రంజన్ మంగరాజ్, రాజ్యసభ సభ్యుడు

ఈవీఎం ధ్వంసం చేసిన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి



పోలింగు కేంద్రంలో ధ్వంసమైన ఈవీఎం

భువనేశ్వర్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ని ధ్వంసం చేసి ప్రిసైడింగ్ అధికారిని కొట్టిన ఆరోపణ కింద భారతీయ జనతా పార్టీ ఖుర్దా నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ప్రశాంత కుమార్ జగదేవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖుర్దా జిల్లా బొలొగాడొ – బెగునియా శాసనసభ నియోజకవర్గం రాజొసున్నొఖొలా సమీపం కంపురియాపట్న 114వ నంబరు పోలింగ్ బూత్‌లో ఓటింగ్ జరుగుతుండగా జగదేవ్ బూత్‌లోనికి ప్రవేశించి ప్రిసైడింగు అధికారిని కొట్టి ఈవీఎంతో సహా ఆస్తులను ధ్వంసం చేసి అక్కడి నుంచి పరారైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. బీజేపీ భువనేశ్వర్ ఎంపీ అభ్యర్థి అపరాజిత షడంగి ఉన్న వాహనంలో ఆయన అక్కడి నుంచి పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అనంతరం పోలీసులు వెంబడించి అతడిని అదుపులోకి తీసుకున్నారు.



పోలీసుల నిర్బంధంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రశాంత కుమార్ జగదేవ్



పోలింగ్ వెబ్‌కాస్టింగ్ వ్యవస్థ

పకడ్బందీగా వెబ్‌కాస్టింగ్

భువనేశ్వర్: మూడో విడత పోలింగ్ నిర్వహణలో యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసింది. ఎన్నికల పోలింగు, వెబ్‌కాస్టింగ్ ఇతరేతర అనుబంధ కార్యకలాపాల సమన్వయం కోసం కంట్రోల్ రూమ్‌లు పకడ్బందీగా పని చేశాయి.



రాష్ట్ర స్థాయిలో ఏర్పాటైన పోలింగ్ కంట్రోల్ రూమ్

పెద్దలు పోలింగ్‌కు.. పిల్లలు సంరక్షణ కేంద్రాలకు..



క్రైచ్ ప్రాంగణంలో ఓటర్ల పిల్లల్ని ఆడిస్తున్న పోలింగ్ స్వచ్ఛంద కార్యకర్తలు



బొమ్మలతో ఆడుకుంటున్న ఓటర్ల పిల్లలు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఈసారి సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పురస్కరించుకుని అత్యధిక ఓటింగ్ కోసం ఎన్నికల యంత్రాంగం పలు చర్యలు చేపట్టింది. అత్యాధునిక సౌకర్యాలు కల్పించి అన్నివర్గాలను ఆకట్టుకోగలిగింది. ప్రధానంగా పసి పిల్లలు ఉన్న ఓటర్లు పిల్లాపాపలతో సహా విచ్చేసి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల ప్రాంగణాల్లో పిల్లల సంరక్షణ శిబిరం (క్రైచ్) ఏర్పాటు చేశారు. ఓటు వేసి తల్లిదండ్రులు వచ్చేంత వరకు పిల్లలు మారాం చేయకుండా బుజ్జగించి ఆటపాటలతో సంరక్షించి కార్యకర్తలు ప్రత్యేక సేవలు అందించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం జగనన్న కాలనీ వద్ద అంపురం–మాణిక్యపురం రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. కవిటి మండలం కుసుంపురం గ్రామానికి చెందిన కె.ఢిల్లీశ్వరరావు, టి.శ్రీసాయిలు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మలుపు వద్ద అదుపుతప్పి ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న ఢిల్లీశ్వరరావుకు తీవ్రగాయాలవ్వగా, శ్రీసాయికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు తులాల ఆభరణాలు చోరీ

బూర్జ: మండలంలోని సింగన్నపాలెంలో వరలక్ష్మికి చెందిన మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. వరలక్ష్మి భర్త తులగాపు బాబూరావు పాలకొండ ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు విధుల్లో భాగంగా పాలకొండ వెళ్లిపోయారు. అనంతరం వరలక్ష్మి నిద్రపోయింది. ఈ సమయంలో గజాల తలుపులకు గడియ పెట్టడం మర్చిపోయింది. ఇదే అదునుగా అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి వరలక్ష్మి ధరించిన రెండు తులాల చైన్, తులం శతమానం తెంచుకుపోయారు. కొద్దిసేపటి తర్వాత మెలకువ రావడంతో చోరీ జరిగినట్లు గుర్తించి కేకలు వేయగా ఇరుగుపొరుగు వారు వచ్చినా అప్పటికే దొంగలు పారిపోయారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఎస్సై జి.వి.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మండలంలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

పోలాకి: మండలంలోని పల్లిపేట వద్ద వంశధార నదిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలాకి పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 50 ఏళ్లు ఉండవచ్చని చెప్పారు. వివరాలు తెలిసిన వారు పోలాకి పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సత్యనారాయణ కోరారు.

వడదెబ్బతో ఉపాధి వేతనదారుడు మృతి


మృతి చెందిన దుర్యోధన

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధి పని చేస్తూ వడదెబ్బకు గురై వేతనదారుడు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు పంచాయతీ చిన్నలక్ష్మీపురం పెద్దగాయి నుంచి కీలువారిపుట్ట వరదగట్టుపై శనివారం ఉదయం ఉపాధి హామీ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన దున్న దుర్యోధన(57) అస్వస్థతకు గురయ్యాడు. పని ప్రదేశంలోనే కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు సపర్యలు చేసినప్పటికీ మృతి చెందాడు. ఫీల్డ్ అసిస్టెంట్ యర్ర జోగారావు ద్వారా విషయం తెలుసుకున్న ఏపీఓ పెట్ల శ్రీనివాసరావు, వీఆర్వో ఢిల్లీరావులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. విషయాన్ని డ్వామా పీడీ దృష్టికి తీసుకువెళ్లి మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మృతుడికి భార్య దాలమ్మ, పెళ్లైన ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సివిల్స్ అభ్యర్థులకు అండగా సుశీలమ్మ ఫౌండేషన్


రాజాం సిటీ: సివిల్స్ చదవాలన్న ఆసక్తి ఉండి సరైన అవకాశాల్లేని విద్యార్థులకు లోలుగు సుశీలమ్మ ఫౌండేషన్ సువర్ణావకాశం కల్పిస్తోంది. ప్రేరణ కార్యక్రమం ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి వారి చదువుకు అయ్యే ఖర్చును భరిస్తూ విద్యార్థులకు చేదోడుగా నిలుస్తోంది. గతేడాది ఇదే తరహాలో 10 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఢిల్లీలో సివిల్స్‌లో శిక్షణ ఇప్పించింది. ఈ ఏడాది కూడా 2022, 23, 24 సంవత్సరాలలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. జూన్ 30న రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు కోచింగ్, వసతి కోసం ఒక్కొక్కరికి రూ. 4 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. హెచ్‌టీటీపీ:// ఏపీఎస్ఎస్‌పి. ఏపీటీఓఎన్ఎల్ఐఎన్ఈ.ఐఎన్/ పీఆర్ఈఆర్ఏఎన్ఏ/ ఐఎన్‌డీఈఎక్స్. పీహెచ్‌పీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. పరీక్ష ఫీజు కింద వంద రూపాయలు చెల్లించాలి. అయితే పరీక్షకు హాజరైన వారికి ఆ నగదు తిరిగి ఇచ్చేస్తారు. పరీక్షను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వారిచే నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 80744 02554 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఓలా పేరుతో బురిడీ..!

- రూ.49,599 లు దోచుకున్న సైబర్ నేరగాళ్లు



బాధితుడి వాట్సాప్‌కు వచ్చిన బిల్లు



సైబర్ నేరగాళ్లకు పంపించిన అమౌంట్

రాయగడ: సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తున్నప్పటికీ ఫలితాలు కనిపించడం లేదు. ప్రతిరోజూ కొత్త తరహాలో నేరగాళ్లు జనాలను మోసగించి ఉనికి చాటుకుంటున్నారు. తాజాగా పట్టణంలోని సాయిప్రియ నగర్‌లో నివాసముంటున్న ఒక పాత్రికేయుడి కుమారుడు సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి రూ.49,599 లు పోగొట్టుకున్న విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై సదరు పోలీసుస్టేషన్‌లో బాధితుడు శుక్రవారం ఫిర్యాదు చేశాడు.

ఫోన్ పే ద్వారా...

సాయిప్రియ నగర్‌లో నివాసముంటున్న గురుప్రసాద్ సాహు అనే వ్యక్తి కుమారుడు ఈనెల 16వ తేదీన ఓలా కంపెనీకి సంబంధించిన ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసేందుకు ఓలా ఎలక్ట్రిక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే యాప్ ద్వారా సన్నాహాలు చేశాడు. ఈక్రమంలో యాప్‌లో వాహనానికి సంబంధించి చాటింగ్ చేయగా, కంపెనీ నుంచి వాహనం ఎంత ఖరీదు పడుతుంది అనే వివరాలతో ఒక బిల్‌ను బాధితుడి వాట్సాప్‌కు పంపించారు. అనంతరం 81005 69937 అనే మొబైల్ నంబర్‌తో బాధితుడికి ఒక కాల్ వచ్చింది. మీరు ఎలక్ట్రికల్ వాహనం కొనుగోలు చేయాలంటే ముందుగా రిజిస్ట్రేషన్ కోసం రూ.999 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అందుకు అంగీకరించిన బాధితుడు వారు పంపించిన యూపీఐ నంబర్‌కు ఫోన్ పే ద్వారా ఆ మొత్తాన్ని పంపించారు. అనంతరం మరో పది నిమిషాల తర్వాత అదే నంబర్ నుంచి మరోసారి కాల్ వచ్చి, మీ పేరుతో బండి బుకింగ్ అయ్యింది. మీరు మా సభ్యులుగా పేరు నమోదు చేసుకున్నారు అని చెప్పారు. ఇక వాహనానికి సంబంధించి డౌన్ పేమెంట్‌గా మరో రూ.28,600 చెల్లించాలన్నారు. దీంతో వారి సూచనల మేరకు ఆ సొమ్మును కూడా జమ చేశారు. మరికొంత సమయం తర్వాత మీరు ఇప్పుడు మరో రూ.20 వేలు డిపాజిట్ చేస్తే మరో గంట తర్వాత ఆ డబ్బులు తిరిగి అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని చెప్పారు. మిగతా అమౌంట్ వాహనం డెలివరీ సమయంలో చెల్లించాలని వెల్లడించారు. అదే క్రమంలో మిగతా రూ.20 వేలు సైతం అతడు జమ చేశాడు. కానీ మరలా ఆ డబ్బులు తిరిగి అకౌంట్‌లో జమ కాకపోవడంతో తనకు కాల్ చేసిన నంబర్‌కు కాల్ చేశాడు. అందుకు బదులుగా సైబర్ నేరగాళ్లు మీ వాహనం బుకింగ్ రద్దయ్యింది. మీరు పంపించిన మొత్తం తిరిగి పంపిస్తామని చెప్పి ఫోన్ కట్ చేశారు. దీంతో తాము సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు గుర్తించి, వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి తమకు జరిగిన మోసం గురించి సైబర్ పోలీసులకు వివరించారు. అనంతరం సదరు పోలీస్ స్టేషన్‌లో సైతం శుక్రవారం ఫిర్యాదు చేశారు.

శ్రీకృష్ణ చంద్రగజపతి నారాయణదేవ్‌కు ఘన నివాళి


కృష్ణచంద్ర గజపతి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఒడియా భాషాభిమానులు


కొత్తమార్కెట్ వద్ద రాజావారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రగతి మహిళా సంఘటన సభ్యులు


సభను ప్రారంభిస్తున్న హరిమోహన్ పట్నాయక్, ఇతరులు


క్విజ్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న భాగవత్ పాఢి, తనూజా


సభలో వక్తలు

పర్లాకిమిడి: పర్లాకిమిడి మహారాజా, ఒడిశా భాషాభిమాని శ్రీకృష్ణచంద్రగజపతి నారాయణ దేవ్ వర్ధంతిని స్థానిక రాజావారి ప్యాలస్‌లో ఉన్న యూటెక్ కంప్యూటర్స్ సంస్థ, ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కుమ్మరి వీధిలోని మహారాజా శ్మశాన వాటిక వద్ద లోకనాథ మిశ్రా, ప్రగతి మహిళా సంఘటన్ కార్యదర్శి తనూజా శతపథి, బిచిత్రానంద బెబర్తా, హరిమోహన్ పట్నాయిక్, శరత్ ప్రధాన్ తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూటెక్ కంప్యూటర్స్ కార్యాలయంలో ప్రాథమిక విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విశ్రాంత బ్యాంకు మేనేజర్ హరిమోహన్ పట్నాయక్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత మట్టిని వదులుకోలేక పర్లాకిమిడిలో స్థిరపడ్డారని, ఒడిషాను ప్రత్యేక భాషా రాష్ట్రంగా ఏర్పాటుకు కృష్ణచంద్రగజపతి బ్రిటీష్ వారితో పోరాడి సాధించగలిగారని గుర్తు చేశారు. ఒడిషా సాహిత్య అకాడమి సభ్యులు బిచిత్రా నంద బెబర్తా క్విజ్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగవత్ పాఢి, త్రిపతి పండా, మురళీధర్ పోరిచ్చా, ప్రణబ్ పండా పాల్గొన్నారు.

పాలపోలమ్మా.. కాపాడమ్మా..

- గుణుపూర్‌లో గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం


పూజలందుకుంటున్న పాలపోలమ్మ అమ్మవారు


శుద్ధ జలాలను తీసుకువస్తున్న బాలికలు


కళాకారుల వేషధారణలు

రాయగడ: గుణుపూర్ ప్రజల గ్రామదేవత పాలపోలమ్మ ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అమ్మవారికి ఇష్టమైన వివిధ వేషాధారణలతో, ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలతో అమ్మవారి మందిరం సందడిగా కనిపించింది. ఉత్సవాల కోసం ప్రత్యేకంగా రైల్వే స్టేషన్ కూడలిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మండపంలో అమ్మవారి ప్రతి రూపాలైన ఘటాలను నిలిపారు. ముందుగా పేరంటాలుగా పిలిచే బాలికలతో కలశాలతో వంశధార నది నుంచి శుద్ధ జలాలను తీసుకువచ్చి అమ్మవారి సన్నిధిలో నిలిపి మండపాన్ని శుద్ధిచేశారు. ఐదు రోజులు జరిగే ఈ ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు కె.శ్రీరాంమూర్తి, ఎస్.బాబూరావు, హరినాథ్, డి.కామేష్ తెలిపారు.

మూడో విడత ఎన్నికల్లో విషాదం

- వడదెబ్బతో ఇద్దరు మృతి

భువనేశ్వర్: రాష్ట్రంలో శనివారం జరిగిన మూడో విడత ఎన్నికల పోలింగ్ విషాదం మిగిల్చాయి. వడదెబ్బకు గురై పోలింగ్ ప్రతినిధితో పాటు మరొకరు మరణించారు. నయాగఢ్ జిల్లా భాపూర్ మండలం పాథొరొపుంజి గ్రామానికి చెందిన కుముదిని దొలేయ్ (60) ఓటు వేయడానికి వెళ్లి కొంత సేపు క్యూలో నిల్చుంది. ఒక్కసారిగా స్పృహ కోల్పోవడంతో ఖండపడా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. వేరొక సంఘటనలో పోలింగ్ ఏజెంట్ సుకదేవ్ పట్నాయక్ బహలుండా గ్రామం 136వ నంబర్ బూత్ వద్ద విధుల్లో ఉండగా అసౌకర్యంగా భావించి అకస్మాతుగా ఒరిగిపోయాడు. వెంటనే హిందోల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

భగ్గుమన్న భానుడు


నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన మార్కెట్ ఏరియా


పర్లాకిమిడి: గజపతి జిల్లా జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో గత నాలుగు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. శనివారం ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉండడంతో జనం ఎండ వేడిని తట్టుకోలేక ఇబ్బంది పడ్డారు. ఉదయం పది గంటలకే జనసంచారం లేక ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. జిల్లాలోని గుసాని సమితి గారబంద, రాయగడ బ్లాక్‌లో మహేంద్రగడ, రామగిరి, ఆర్.ఉదయగిరి బ్లాక్‌లో పలు గ్రామాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తున్నప్పటికీ పర్లాకిమిడిలో చినుకు కూడా లేదు. ఎండ తీవ్రతతో దుకాణాలన్నీ మూతపడ్డాయి.


ఆదిత్యుని సన్నిధిలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి


సాయిప్రసాద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, భూ పరిపాలనా విభాగ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్, అర్చకులు ఇప్పిలి సాందీప శర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ భూములు, ఆదాయ వివరాలను ఈవో వివరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఆర్‌డీవో సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ రాణి పాల్గొన్నారు.

దుర్గా జాతర ఆరంభం


పూజలందుకుంటున్న సమలాయి దుర్గా


కొలువుదీరిన ఘటాలు

రాయగడ: స్థానిక పయికొవీధిలో కొలువైన మా సమలాయి దుర్గా జాతర శనివారం రాత్రి నుంచి ప్రారంభమైంది. ఐదురోజులు జరిగే జాతరలో భాగంగా అమ్మవారి పాదాలను తీసుకువచ్చి మందిరంలో నిలపడంతో జాతరకు శ్రీకారం చుట్టారు. నిత్యపూజలతోపాటు రోజూ సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తారు. కొలువైన ఘటాలలో పుర ప్రజలు అమ్మవారికి ముందుగా మొక్కుకున్న విధంగా ఈ ఏడాది పండే మామిడి పండ్లను వేసి చీర, రవికలను సమర్పిస్తారు. జాతర చివరిరోజున మల్లెలు (అగ్గిపై పూజారి నడక) వంటి కార్యక్రమాలు జరుగతాయి. ఈ ఘట్టాలను వీక్షించేందుకు భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారు.

‘ఆదివాసీ ప్రజల మధ్య సమైక్యతా భావం’



మాట్లాడుతున్న, ప్రొఫెసర్ సత్యనారాయణ రథ్ తదితరులు

జయపురం: వివిధ ఆదివాసీ సాంప్రదాయ ప్రజల మధ్య సమైక్యతా భావం నిలిచి ఉందని ప్రొఫెసర్ సత్యనారాయణ రథ్ అన్నారు. కొరాపుట్ కోట్స్ సభాగృహంలో శనివారం నిర్వహించిన ప్రొఫెసర్ అజిత్ కుమార్ మిశ్ర మెమోరియల్ వక్తృత్వ మాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొరాపుట్ కోట్స్, ప్రొఫెసర్ అజిత్ మిశ్ర మెమోరియల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి కోట్స్ డైరెక్టర్ ప్రఫుల్ల చంద్ర మహాపాత్రో అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రథ్ మాట్లాడుతూ దివంగత అజిత్ మిశ్ర తన కార్యక్రమాల్లో జాతి ధర్మ భేదాలు లేకుండా అందరి ఐక్యతకు కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా రాయగడ జిల్లా చాలకంబ గ్రామంలో నివాసముంటున్న సవర సాంప్రదాయ ప్రజలతో పాటు వివిధ ఆదివాసీ సాంప్రదాయ ప్రజలను ఒకే తాటిపై నిలిపి, వారి మధ్య స్నేహ సంబంధాలు నెలకొల్పడంతో ఆయన కృషి చిరస్మరణీయమని ప్రశంసించారు. మిశ్ర పేరున ప్రతి ఏడాది చర్చావేదిక నిర్వహించి ఆయన సేవలు స్మరించుకునేందుకు ఆయన భార్య డాక్టర్ బిమళ మిశ్ర 2010లో మొదటి వక్తృతామాల కార్యక్రమం ప్రారంభించారన్నారు. ఆ చర్చా కార్యక్రమాలు 2018 వరకు జరిగాయని వెల్లడించారు. అనంతరం కోవిడ్ తదితర కారణాల వలన గత 5 ఏళ్లు జరగలేదని పేర్కొన్నారు. మరలా ఈ కార్యక్రమం నిర్వహించేందుకు కోట్స్ సంస్థ సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జగబందు సామల్, ఆదివాసీ జీవన పరిశోధకుడు డాక్టర్ పరేష్ రథ్, సుధాకర పట్నాయిక్, నారాయణ పండ, రాజేంద్ర పండ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మా కురేసిని సంబరాలు


అమ్మవారి జాతరలో మహిళలు


అమ్మవారి ఘటాలకు పూజలు చేస్తున్న మహిళలు


కొలువైన మాకురేసిని అమ్మవారు


విద్యుత్ దీపాలంకరణ

పర్లాకిమిడి: పర్లాకిమిడిలోని స్థానిక నాలుగో వార్డు, ఒడ్డి మంగళవీధిలో మాకురేసిని అమ్మవారి సంబరాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే సంబరాలు సందర్భంగా ఒడ్డి మంగళి వీధిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రోజూ సాయంత్రం ఊరేగిస్తారు. దాదాపు 13 సంవత్సరాల తరువాత సంబరాలను నిర్వహిస్తుండడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. వచ్చే మంగళవారంతో అమ్మవారి సంబరాలు ముగుస్తాయని కొన్సిలరు బబునా పాత్రో తెలియజేశారు.

ఎన్‌సీసీ కెడెట్స్‌కు శిక్షణ


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ దేవీ ప్రసాద్ మిశ్ర

జయపురం: బరంపురం ఎన్‌సీసీ గ్రూపు హెడ్‌క్వార్టర్ పరిధిలోని జయపురం విక్రదేవ్ విశ్వ విద్యాలయ ప్రాంగణంలో ఎన్‌సీసీ కెడెట్స్‌కు వేసవి వికాశ రెండో విడత శిక్షణ శిబిరాన్ని శనివారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఓఎస్‌డీ డాక్టర్ ప్రొఫసర్ దేవీప్రసాద్ మిశ్ర జ్యోతిని వెలిగించి శిబిరాన్ని ప్రారంభించారు. క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కర్నల్ ప్రీతి రంజన్ దాస్ ముఖ్యవక్తగా హాజరై శిబిరంలక్ష్యం, ప్రాధాన్యతను వివరించారు. ఎన్‌సీసీ కెడెట్లు సమాజానికి, దేశానికి సేవ చేసేందుకు ముందుండాలని ఉద్బోధించారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతోందన్నారు. విక్రమదేవ్ విశ్వ విద్యాలయ అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ లక్ష్మణ పాత్రో పర్యవేక్షణలో నిర్వహిస్తున్న శిబిరంలో మొదటి విడత శిక్షణలో కొరాపుట్ జిల్లా నుంచి 317 మంది, రెండో విడతలో 400 మంది కెడెట్లు పాల్గొన్నట్టు నిర్వాహక అధికారులు వెల్లడించారు. శిక్షణలో భాగంగా మ్యాప్ రీడింగ్, తుపాకులు పేల్చటం, డ్రిల్, పేరేడ్, అగ్నిప్రమాద నివారణ, డిజిటల్ బ్యాంకింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించార. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి న్యూఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవాలలో జరిగే పేరేడ్‌కు పంపిస్తామన్నారు.


శిక్షణకు హాజరైన ఎన్‌సీసీ కెడెట్లు

క్లుప్తంగా

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మృతిచెందిన త్రిమూర్తులు



తీవ్రంగా గాయపడిన సూరజ్ కుమార్ యాదవ్

సాలూరు: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ వాసునాయుడు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. సాలూరు పట్టణంలోని వంటలవీధిలో నివాసముంటున్న త్రిమూర్తులు (50) పచ్చళ్ల వ్యాపారం చేస్తుంటాడు. ఎప్పటిలాగే శనివారం కూడా పచ్చళ్ల విక్రయానికి ద్విచక్ర వాహనంపై మక్కువ మండలం నంద గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కూర్మరాజుపేట జంక్షన్ వద్దకు వచ్చేసరికి.. ఐస్ వ్యాపారి సూరజ్‌కుమార్ బంగారమ్మపేట నుంచి సాలూరు వైపు వెళ్తూ ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో త్రిమూర్తులు అక్కడికక్కడే మృతి చెందగా.. సూరజ్‌కుమార్‌యాదవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రుడ్ని సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముత్తాయవలసలో చైన్ స్నాచింగ్..

బొబ్బిలి: మండలంలోని ముత్తాయవలసలో మహిళ మెడలోని గొలుసును తెంచుకుపోయిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సై జి. లోవరాజు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బలగ లక్ష్మి గ్రామ శివారున ఉన్న బావి వద్దకు నీళ్ల కోసం వచ్చింది. ఈ సమయంలో బైక్‌పై హెల్మెట్‌తో పాటు ముసుగు వేసుకుని వచ్చిన ఓ అగంతుకుడు తాగేందుకు మంచి నీళ్లిమ్మని అడిగాడు. ఆమె నీళ్లు పడుతుండగానే మహిళ ను కొట్టి తిరగేసి మెడలోని గొలుసు తెంచుకుపోయాడు. ఈక్రమంలో జరిగిన పెనుగులాట లో బాధితురాలి చేతిలో అరతులం, దొంగ చేతి లో తులం గొలుసు ఉండిపోయాయి. బాధితు రాలి ఫిర్యాదు మేరకు ఎస్సై జి. లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్స్ అభ్యర్థులకు అండగా సుశీలమ్మ ఫౌండేషన్

రాజాం సిటీ: సివిల్స్ చదవాలన్న ఆసక్తి ఉండి సరైన అవకాశాల్లేని విద్యార్థులకు లోలుగు సుశీలమ్మ ఫౌండేషన్ సువర్ణావకాశం కల్పిస్తోంది. ప్రేరణ కార్యక్రమం ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి వారి చదువుకు అయ్యే ఖర్చును భరిస్తూ విద్యార్థులకు చేదోడుగా నిలుస్తోంది. గతేడాది ఇదే తరహాలో 10 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఢిల్లీలో సివిల్స్‌లో శిక్షణ ఇప్పించింది. ఈ ఏడాది కూడా 2022, 23, 24 సంవత్సరాలలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. జూన్ 30న రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు కోచింగ్, వసతి కోసం ఒక్కొక్కరికి రూ. 4 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. హెచ్‌టీటీపీ:// ఏపీఎస్ఎస్‌పి. ఏపీటీఓఎన్ఎల్ఐఎన్ఈ.ఐఎన్/ పీఆర్ఈఆర్ఏఎన్ఏ/ ఐఎన్‌డీఈఎక్స్. పీహెచ్‌పీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. పరీక్ష ఫీజు కింద వంద రూపాయలు చెల్లించాలి. అయితే పరీక్షకు హాజరైన వారికి ఆ నగదు తిరిగి ఇచ్చేస్తారు. పరీక్షను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వారిచే నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 80744 02554 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చిన్నారులపై దాడి



ఆస్పత్రిలో పిల్లల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై షేక్ శంకర్

సంతకవిటి: మండల పరిధిలోని డోలపేటలో పాత జనసేన కార్యాలయం దగ్గర ఇద్దరు చిన్నారులపై దాడి చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితులు, ఎస్సై షేక్ శంకర్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన బండి జశ్వంత్‌కుమార్ (14), బండి శేఖర్(13) అన్నదమ్ములు. తమ మేనత్త రాజాంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో పరామర్శకు వచ్చారు. ఈ క్రమంలో డోలపేటలో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ని రాజు కార్యాలయం వద్ద నిలిపిన కారు అద్దాలు చూస్తుండగా.. ఎన్నిరాజు అనుచరులు అనుమానంతో చిన్నారులను కొట్టారు. తర్వాత వారిని కార్యాలయంలోకి తీసుకెళ్లగా.. అక్కడ ఎన్ని రాజు కూడా చిన్నారులపై చేయి చేసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. ప్రస్తుతం ఇద్దరు చిన్నారులు రాజాం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఇకపై హైస్కూల్ ప్లస్..



బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశాల క్రీడామైదానం

- సర్కార్ ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియట్ చదువులు
- బడుగు, బలహీనవర్గ విద్యార్థులకు అందుబాటులో ఉన్నత విద్య
- ఏడు స్కూళ్లలో ఈ ఏడాది నుంచే అమలు
- 40 సీట్ల వంతున రెండేసి కోర్సులతో ప్రారంభం
- ప్రవేశాల కోసం ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్



'హైస్కూల్ ప్లస్' అమలవుతున్న బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

విజయనగరం అర్బన్: బడుగు, బలహీన వర్గాలకు విద్యను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి తొలి నుంచి విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తూనే ఉన్నారు. గత పాలకులు పట్టించుకోని విద్యావ్యవస్థలో ప్రగతి పరుగులు పెట్టించారు. మనబడి నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. పుస్తకాలు, యూనిఫారాలు, ట్యాబ్‌లు అందజేయడంతో పాటు నాణ్యమైన ఆహారం, మెరుగైన బోధన అందించడంతో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. సౌకర్యవంతమైనా ఆయా పాఠశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సులు కూడా ప్రవేశ పెట్టి ఉన్నత విద్యను అందుబాటులో తేవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముందడుగు వేశారు. రెండేళ్ల కిందట జిల్లాలోని ఎస్.కోట మండలం ధర్మవరం ఉన్నత పాఠశాలలో ప్రయోగాత్మకంగా 'హైస్కూల్ ప్లస్' పేరుతో ఇంటర్మీడియట్ కోర్సులను ప్రవేశపెట్టారు. ఈ ఏడాది మరో అడుగు ముందుకేసి జిల్లాలో ఏడు హైస్కూళ్లను 'హైస్కూల్ ప్లస్'గా అప్‌గ్రేడ్ చేస్తూ విద్యాశాఖ ఆదేశాలిచ్చింది.

అందుబాటులో ఉన్నత విద్య

విభజిత విజయనగరం జిల్లాలో 27 మండలాలుండగా.. 17 మండలాల్లో మాత్రమే ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. దీంతో మిగిలిన మండలాలకు చెందిన బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ఇంటర్మీడియట్ చదువులు అందని ద్రాక్షలా మారాయి. పట్టణాల్లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదవించడం విద్యార్థుల తల్లిదండ్రులకు తలకు మించిన భారం కావడంతో, పిల్లల చదువులు పదితోనే ఆగిపోతున్నాయి. ఈ సమస్యను గుర్తించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాఠశాల స్థాయిలోనే ఇంటర్మీడియట్ కోర్సులను ప్రవేశ పెట్టాలనే ఆలోచన చేశారు. తొలుత జిల్లాకి ఒక హైస్కూల్‌ని ఎంపిక చేసి 'హైస్కూల్ ప్లస్' పేరుతో ఇంటర్మీడియట్ కోర్సులను రేండేళ్ల కిందట ప్రారంభించారు. మంచి ఫలితాలు రావడంతో వాటిని విస్తరించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో మరో ఏడు హైస్కూళ్లను 'హైస్కూల్ ప్లస్'గా అప్‌గ్రేడ్ చేశారు.

నాలుగు గ్రూప్‌లు..

ఇంటర్మీడియట్ గ్రూపుల్లో ప్రధానంగా డిమాండ్ ఉన్న నాలుగు గ్రూపులను పాఠశాలల్లో నిర్వహిస్తారు. అయితే ప్రతి స్కూల్‌లో ప్రవేశాల సరిపడా ఉన్న రెండు గ్రూప్‌లకే మొదటి ప్రాధాన్యం ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులున్నాయి. ప్రతి గ్రూప్‌లో 40 మందికి ప్రవేశం కల్పిస్తారు.

మౌలిక సదుపాయాలు

తొలి విడతగా అమలు చేస్తున్న ఏడు 'హైస్కూల్ ప్లస్' స్కూళ్లలో మౌలిక సౌకర్యాలు పుష్కలంగా ఉన్నాయి. ఇంటర్మీడియట్ చదువులకు అవసరమైన అన్ని హంగులు ఏర్పాటు చేశారు. లైబ్రరీ, సైన్స్ గ్రూపులకు అవసరమైన లేబరేటరీలు ఏర్పాటు చేశారు. కనీసం రెండు ఎకరాల విస్తీర్ణమున్న విశాలమైన క్రీడా మైదానాలు ఈ స్కూళ్లలో ఉన్నాయి. ఆయా మండల పరిధిలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ స్కూళ్లు వరంగా మారనున్నాయి.

ఈ ఏడాది నుంచే అమలు..

జిల్లాలో వివిధ యాజమాన్యాలకు చెందిన దాదాపు 300 ఉన్నత పాఠశాలలున్నాయి. ఇప్పటికే కేజీబీవీలలో, మోడల్ స్కూళ్లలో ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేని ఏడు మండలాలను తీసుకొని వాటిలో కో-ఎడ్యుకేషన్‌గా ఇంటర్మీడియట్ చదువులను అందుబాటులోకి ఈ ఏడాది నుంచి తీసుకువచ్చారు. విజయనగరం డివిజన్ పరిధిలోని జామి, బొండపల్లి.. బొబ్బిలి డివిజన్ పరిధిలోని రామభద్రపురం, పిరిడి.. చీపురుపల్లి డివిజన్ పరిధిలో తెట్టంగి, కోనూరు, ఏ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను 'హైస్కూల్ ప్లస్'లుగా తీర్చిదిద్దారు.



ప్రవేశాల కోసం నిర్వహించాల్సిన డ్రైవ్‌పై సిబ్బందికి సూచనలిస్తున్న డీఈఓ ప్రేమకుమార్ (ఫైల్)

'హైస్కూల్ ప్లస్' స్కూళ్లు, ప్రధానోపాధ్యాయుల ఫోన్ నంబర్లు

స్కూల్ పేరు	మండలం	హెచ్ఎం ఫోన్
ఏవీపురం జెడ్పీహెచ్ఎస్	ఆర్.ఆమదాలవలస	9441414824
పిరిడి జెడ్పీహెచ్ఎస్	బొబ్బిలి	8328390189
రామభద్రపురం జెడ్పీహెచ్ఎస్	రామభద్రపురం	9490498164
బొండపల్లి జెడ్పీహెచ్ఎస్	బొండపల్లి	8978542551
జామి జెడ్పీహెచ్ఎస్	జామి	8985384628
కోనూరు జెడ్పీహెచ్ఎస్	గరివిడి	9490543986
తెట్టంగి జెడ్పీహెచ్ఎస్	గుర్ల	8106135944
ధర్మవరం జెడ్పీహెచ్ఎస్	ఎస్.కోట	9494919747

ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్

ఈ విద్యాసంవత్సరం నుంచి 'హైస్కూల్ ప్లస్' స్కూళ్లుగా మారనున్న ఏడు పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నాం. ఆయా స్కూళ్ల పరిసర గ్రామాల్లో విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నాం. పదో తరగతి తర్వాత ఏ ఒక్కరూ చదువు మానేసే పరిస్థితి రాకూడదనేది ప్రభుత్వ ఉద్దేశం. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

-ఎస్.ప్రేమకుమార్, డీఈఓ

మాతా,శిశు మరణాల నివారణపై ప్రత్యేక దృష్టి

● డీపీఎంఓ రవికుమార్



గర్భిణి ఇంటి వద్ద హెల్త్ రికార్డులు పరిశీలిస్తున్న డీపీఎంఓ రవికుమార్

సీతానగరం: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో మాతా,శిశు మరణాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డీపీఎంఓ డాక్టర్ పీఎల్ రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులకు డాక్టర్ పావని పర్యవేక్షణలో వైద్య సిబ్బంది అందిస్తున్న వైద్యసేవలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ, ఎక్కువ శాతం మంది మహిళల్లో హిమోగ్లోబిన్(ఐరన్) తక్కువ ఉన్నట్లు గుర్తించామన్నారు. ఐరన్ లోపాన్ని అధిగమించడానికి ప్రభుత్వం ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పెదబోగిలి, సీతానగరం గ్రామాల్లో ఐరన్ లోపం ఉన్నట్లు వైద్య సిబ్బంది గుర్తించిన గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారం వినియోగం, మందుల వాడకంపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ డాక్టర్ బి. పావని మాట్లాడుతూ.. సీతానగరం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న 18 వెల్‌నెస్ కేంద్రాల పరిధిలో 21 మంది గర్భిణులు హైరిస్క్‌లో ఉన్నట్లు గుర్తించి, వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్‌వీ రమణ, హెల్త్ సూపరువైజర్ శర్మ, పీహెచ్ఎన్ సత్యవతి, ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అమానుషం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకళ్యాణి

విజయనగరం క్రైమ్: మానవ అక్రమ రవాణా అమానుషమని, చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకళ్యాణి అన్నారు. సంస్థ కార్యాలయ ఆవరణలో 'మిస్సింగ్ చిల్డ్రన్స్, వివిధ రకాల బాధితుల మానవ అక్రమ రవాణా' అనే అంశంపై శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెట్టిచాకిరీ, అవయవాలు, మత్తుపదార్థాల వ్యాపారం, వ్యభిచారం తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల కోసం బాల, బాలికలను, యువతీయువకులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమని, దీనికి కారణమైన వారికి కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తామన్నారు. పీఎల్‌ఏపీయూఎస్ జడ్జి జి.దుర్గయ్య మాట్లాడుతూ మానవులను గనులు, కర్మాగారాల్లో వెట్టిచాకిరీ పనులు, సైబర్ నేరాలకు అక్రమంగా తరలిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని హితవు పలికారు. దిశ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో తప్పిపోయిన పిల్లలను వెతికి గుర్తించామని, పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వన్‌స్టాప్ సెంటర్, సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ కె.సాయి విజయలక్ష్మి మాట్లాడుతూ కుటుంబ కలహాలు, వరకట్న వేధింపులు, ప్రేమ వివాహం తదితర వాటిలో బాధిత మహిళలకు అండగా వన్‌స్టాప్ సెంటర్ ఉందన్నారు. బాధిత మహిళలకు కౌన్సిలింగ్ , వైద్యం, రక్షణ, న్యాయం, పునరావాసం, తదితర సేవలు అందిస్తున్నామని చెప్పారు. లీగల్ కౌన్సిలర్ జయలక్ష్మి మాట్లాడుతూ అనాథలైన పిల్లలను చట్టప్రకారం అడాప్షన్ సెంటర్ ద్వారా పిల్లలు లేని తల్లిదండ్రులకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా, వివిధశాఖల, అధికారులు, న్యాయ సేవా సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించిన ఎస్పీ

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ ఎం.దీపిక శనివారం సందర్శించారు. అక్కడ ఏర్పాటుచేసిన మూడంచెల భద్రత, గార్డ్స్ పనితీరును తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందికి భద్రతాపరమైన సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. వైశాఖ మాసం, శనివారం కలిసి రావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలు భక్తులు విచ్చేసి శ్రీరామచంద్రస్వామిని, ఆలయ క్షేత్ర పాలకుడైన ఉమా సదాశివుడిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక హోమాలు, సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన పలువురు కళాకారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భక్తి భజనలు ఆకట్టుకున్నాయి.

ఏయూ డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్టు పరీక్షల విభాగం డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలను ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. డిగ్రీ ఆరో సెమిస్టర్‌లో మొత్తం 27,603 మంది పరీక్షకు హాజరవగా 27,483 మంది (99.57 శాతం)ఉత్తీర్ణత సాధించారు. బీఏ(సీబీసీఎస్)లో 99.68, బీబీఏ(సీబీసీఎస్)లో 98.66, బీకాం (కంప్యూటర్స్)లో 99.71, బీకాం(జనరల్)లో 99.92, బీహెచ్ఎంసీటీలో 100, బీఎస్సీలో 99.52, బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీలో 90, బీఎస్సీ ఫుడ్ సైన్స్‌లో 100, బ్యాచలర్ ఆఫ్ వెటర్నరీలో 100, బ్యాచలర్ ఆఫ్ ఓకేషన్‌లో 100 మంది ఉత్తీర్ణత సాధించారు.

డిగ్రీ ఫలితాల్లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు



కన్నా జోస్యుల అపూర్వ



మంచుకొండ అలివేలు మంగ తాయారు



నౌపడ హిమాని




హారిక

విజయనగరం అర్బన్: ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 2021 - 24 బ్యాచ్ డిగ్రీ తుది పరీక్షల (ఆరో సెమిస్టర్) ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. పట్టణంలోని ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పలు సబ్జెక్ట్‌లలో మొదటి మూడు స్థానాలు సాధించారు. బీసీఏ గ్రూప్‌లో దత్తిరాజేరు మండలం ఇంగిలాపల్లి గ్రామానికి చెందిన కన్నా జోస్యుల అపూర్వ 9.25 సీజీపీఎస్ పాయింట్లు, పట్టణంలోని కామాక్షినగర్‌కు చెందిన కట్లమూడి భవ్యతేజ 9.24 తొలి రెండు స్థానాల్లో నిలిచారు. బీఎస్సీ (సీబీసీఎస్)లో మెరకముడిదాం మండలం బిల్లలవలసకు చెందిన ఆరవెల్లి ఆశ్రితరాం 9.60, డెంకాడ మండలం చింతలవలస చెందిన శంకుసాయి ప్రవల్లిక 9.56 సీజీపీఎస్ పాయింట్స్‌లో జిల్లా స్థాయిలో రెండు, మూడు స్థానాలు సాధించారు. బీకాం (జనరల్) విభాగంలో పట్టణానికి చెందిన మంచుకొండ అలివేలు మంగతాయారు 9.31 సీజీపీఏ పాయింట్స్, వినినిగిరి గీతాంజలి 9.19, మోతమర్రి అనూష 8.85 పాయింట్లతో వరుసగా మొదటి, రెండు, మూడు ర్యాంకులు సాధించారు. బీబీఏలో పట్టణానికి చెందిన బగ్గాం లిఖిత 8.68, కెల్ల తరుణిసాయిశ్రీ 8.64 పాయింట్లతో రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో పట్టణానికి చెందిన నేపాడ హిమాని 8.65, సారిక నయోమి 8.62, రాజాం మండలానికి చెందిన కోడూరు వెన్నెల 8.50 పాయింట్లతో మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు.

జిల్లా టాపర్ హారిక..

బొబ్బిలి: బీఎస్సీ మ్యాథ్స్, స్టాటస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో పొట్నూరు హారిక 9.7 పాయింట్లతో జిల్లా టాపర్‌గా నిలిచింది. దీంతో హారికను రాజా కాలేజ్ ప్రిన్సిపాల్ చల్లా వీరంద్రకుమార్, అభినందించారు.

కడుపు కోతలపై కొరడా



పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గర్భిణికి సిజేరియన్ చేస్తున్న వైద్యులు

- సిజేరియన్లు అధికంగా చేసే ఆస్పత్రులపై చర్యలు
- జిల్లాలో 9 ప్రైవేటు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేసిన వైద్య ఆరోగ్యశాఖ
- ప్రసవాల్లో 80 శాతం ఆపరేషన్లకే మొగ్గు
- ఓ ఆస్పత్రిలో శతశాతం సిజేరియన్లే

విజయనగరం ఫోర్ట్:

కాసులకు కక్కుర్తిపడి కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు ప్రసవం కోసం వచ్చే గర్భిణులకు కడుపుకోత మిగుల్చుతున్నారు. అవసరం ఉన్నా లేకున్నా సిజేరియన్లు చేస్తున్నారు. మహిళల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ప్రభుత్వాస్పత్రుల కంటే ప్రైవేటు ఆస్పత్రుల్లోనే అధికంగా సిజేరియన్లు జరుగుతున్నాయి. కొన్ని ఆస్పత్రుల్లో 80 శాతంకు పైగా సిజేరియన్లు జరగ్గా, మరి కొన్ని ఆస్పత్రుల్లో శతశాతం సిజేరియన్లు జరగడం గమనార్హం. వీటికి అడ్డుకట్ట వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ కొరడా ఝుళిపించింది. అత్యధికంగా సిజేరియన్లు చేసిన ప్రైవేటు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేసింది. కారణాలు తెలియజేయాలని కోరింది.

● 9 ఆస్పత్రులకు నోటీసులు

జిల్లాలో సిజేరియన్లు అధికంగా నిర్వహిస్తున్న 9 ఆస్పత్రులకు వైద్యారోగ్యశాఖ అధికారులు నోటీసులు జారీచేశారు. జీఎంఆర్ వరలక్ష్మి కేర్ హాస్పటల్, అమృత హాస్పటిల్, శ్రీ సాయి పీవీఆర్ ఆస్పత్రి, వెంకటరామ ఆస్పత్రి, పీజీ స్టార్ ఆస్పత్రి, మువ్వగోపాల ఆస్పత్రి, కొలపర్తి ఆస్పత్రి, గాయత్రి ఆస్పత్రి, అభినవ నర్సింగ్ ఆస్పత్రికి నోటీసులు జారీ చేశారు.

● సిజేరియన్‌తో ఆరోగ్య సమస్యలు

ఒకసారి సిజేరియన్ చేస్తే రెండో కాన్పులో కూడా సిజేరియన్ తప్పనిసరి. దీనివల్ల మహిళలకు నడుంనొప్పి, కాళ్ల నొప్పులు వంటి సమస్యలు చుట్టుముడతాయి. సాధారణ ప్రసవం అయితే రక్తస్రావం తక్కువగా జరుగుతుంది. అదే సిజేరియన్ అయితే రక్తస్రావం అధికంగా జరుతుంది. దీనివల్ల మహిళలు రక్తహీనతకు గురయ్యే అవకాశం ఉంది. సాధారణ ప్రసవం అయితే కేవలం రూ.10 వేలు నుంచి రూ.15 వేలు ఖర్చు అవుతుంది. సిజేరియన్ అయితే రూ.25 వేల నుంచి రూ.40వేల వరకు కార్పొరేట్ ఆస్పత్రులు వసూలు చేస్తున్నాయి.

● సిజేరియన్‌కే ప్రాధాన్యం

ప్రైవేటు ఆస్పత్రికి గర్భిణి రాగానే ఏదో ఒక కారణం చెప్పి సిజేరియన్ చేయడానికే ప్రాధాన్యమిస్తున్నారు. కడుపులో బిడ్డ ఉమ్మనీరు తాగింది, బీపీఎక్కువగా ఉంది ఇలా ఏదో ఒక కారణం చెప్పి సిజేరియన్ చేసేస్తున్నారు. వైద్యుడు చెప్పినట్టు చేయకపోతే తల్లీబిడ్డకు ఏమవుతుందోనని భయపడి వైద్యుల చెప్పినట్టు తలాడిస్తున్నారు. జిల్లాలో ప్రసవాలు జరిగే ప్రభుత్వాస్పత్రులు 57 ఉన్నాయి. వీటిలో పీహెచ్‌సీలు 44, సీహెచ్‌సీలు 11, ఘోషాస్పత్రి, ఏరియా ఆస్పత్రి ఉన్నాయి. ప్రసవాలు జరిగే ప్రైవేటు ఆస్పత్రులు 64 వరకు ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో అధిక శాతం సాధారణ ప్రసవాలు జరిపేందుకే వైద్యులు ప్రయత్నిస్తుండగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రం సిజేరియన్లకే మొగ్గుచూపుతున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది

కళలు నేర్పే వారి కల నెరవేరింది...

- బాలభవన్ కేంద్రాల్లో సిబ్బందిని రెగ్యులర్ చేసిన ప్రభుత్వం
- జీఓ 62 ద్వారా వారి జీవితాల్లో వెలుగులు
- మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి కృషితో కరుణించిన సర్కారు



చీపురుపల్లిలోని జవహర్ బాలభవన్ కేంద్రం

చీపురుపల్లి: ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా మూడు దశాబ్దాలుగా వారంతా ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న కల. ఎన్నో ప్రభుత్వాలు మారాయి కానీ వారి కష్టాన్ని గుర్తించలేదు. అయినప్పటికీ అరకొర వేతనాలతో పనిచేస్తూ ఏ రోజుకైనా తమను ఆదుకునే దేవుడు రాకపోతాడా అంటూ పిల్లలను తీర్చిదిద్దుతూ పని చేశారు. ఎట్టకేలకు దేవుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి రూపంలో వచ్చి మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న కలను నెరవేర్చాడు. జవహర్ బాలభవన్ కేంద్రాల్లో పని చేస్తున్న ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తింపునిస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా జవహర్ బాలభవన్ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి. జీవితాంతం సీఎం జగన్ మోహన్ రెడ్డిని మరిచిపోలేమని వారంతామ చెబుతుండడం విశేషం.

బాలభవన్ కేంద్రాలంటే ఏమిటి..

పేద ఇళ్లల్లో జన్మించిన చిన్నారుల్లో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికి తీయాలంటే చాలా ఫీజులు కట్టుకుని ప్రైవేట్ కేంద్రాల్లో శిక్షణ ఇప్పించాలి. ఇది అందరికీ సాధ్యం కాకపోవడంతో వారి ఆశయాన్ని నెరవేర్చాలనే లక్ష్యంతో 1962లో ఇందిరాగాంధీ దేశ వ్యాప్తంగా జవహర్ బాలభవన్ కేంద్రాలు నెలకొల్పింది. అనంతర కాలంలో 1993లో ఏపీలో పాఠశాల విద్యాశాఖ ద్వారా జవహర్ బాలభవన్‌లు ఏర్పడ్డాయి. ఈ కేంద్రాల ద్వారా చిన్నారులకు నిరంతరం శాస్త్రీయ నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, క్రియేటివ్ రైటింగ్ వంటి విభాగాల్లో శిక్షణ ఇస్తూ వారిలో ఉన్న దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభకు పదును పెడుతున్నారు. కేంద్రాల్లో శిక్షణ పొందిన ఎంతోమంది చిన్నారులు ఎంతో గొప్ప స్థాయికి చేరుకున్నారు.

రాష్ట్రంలో బాలభవన్ కేంద్రాలు ఇలా.....

రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ జవహర్ బాలభవన్ కేంద్రాలున్నాయి. అందులో భాగంగానే చీపురుపల్లి, రాజాం, విజయనగరం, విశాఖపట్టణం, కాకినాడ, అనంతపురం, పాలకొల్లు, కడప, విజయవాడ, తిరుపతి, చిత్తూరు, కర్నూలు, మచిలీపట్నం, ఏలూరు, నంధ్యాల, తదితర ప్రాంతాల్లో జవహర్ బాలభవన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలోనూ దాదాపు 300 మంది విద్యార్థులు నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, క్రియేటివ్ రైటింగ్ విభాగాల్లో శిక్షణ పొందుతున్నారు. అంతేకాకుండా ప్రతిఏటా వేసవి సెలవుల్లో వేసవి శిక్షణ తరగతులు పేరుతో వందలాది మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తుంటారు.


అరకొర జీతాలతోనే...

జవహర్ బాలభవన్ కేంద్రాల్లో సూపరింటెండెంట్, ఇన్‌స్ట్రక్టర్, ఆయా, శిక్షకులుగా చాలా మంది తాత్కాలిక ప్రాతిపదికన దశాబ్దాల కాలంగా విధులు నిర్వహిస్తున్నారు. వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఎప్పటి నుంచో ప్రభుత్వాలను కోరుతున్నారు. కాని ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో వీరి సమస్యను మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ప్రభుత్వం వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తూ జీఓ విడుదల చేసింది.



చిన్నారులకు సంగీతం నేర్పుతున్న ఇనస్ట్రక్టర్

జీవిత కాలం కోరిక నెరవేరింది.....



మూడు దశాబ్దాల కాలంగా బాలభవన్ కేంద్రంలో పని చేస్తూ ఎంతో మంది పిల్లలను నృత్యం, చిత్రలేఖనం, సంగీతంలో తీర్చిదిద్దాం. తమ కేంద్రాల్లో నృత్యం నేర్చుకున్న పిల్లలు విదేశాల్లో సైతం ప్రదర్శనలు ఇచ్చారు. అరకొర జీతాలతోనే పని చేశాం. బాలభవన్ కేంద్రాల్లో పని చేసే సిబ్బందిని రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌ను మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగే విధంగా చూశారు. తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీఓ 62ను విడుదల చేసింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి జీవిత కాలం రుణపడి ఉంటాం.

– డాక్టర్ సుంకరి రమేష్, సూపరింటెండెంట్, జవహర్ బాలభవన్ కేంద్రం, చీపురుపల్లి